మండే ఎండలో.. చల్లచల్లగా...

- శీతల పానీయాలకు భలే గిరాకీ
- స్థానిక ప్రాంతాల్లో జోరుగా విక్రయాలు
- భానుడి తాపం నుంచి ఉపశమనం పొందుతున్న జనం

సీతంపేట: భానుడు భగభగలాడుతున్నాడు. ఎండ వేడిమిని తాళలేక నగరవాసులు అల్లాడుతున్నారు. రోహిణి కార్తె రోళ్లు బద్దలవుతాయంటారు. వారం పది రోజులుగా సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. దానికి తోడు ఉక్కపోత ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. భరించలేని వేడి, వేసవి తాపంతో జనం సతమతమవుతున్నారు. రుతుపవనాలు ముందుగా వచ్చినా సూర్యుడు తన ప్రభావంతో హడలెత్తిస్తున్నాడు. పగలంతా ఎండ కాయడం, సాయంత్రం వర్షం కురవడం దినచర్యగా మారింది. ఈ ఏడాది ఇంత వేడిని చూడటం మొదటి సారి కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమి తాళలేక పాదాచారులు, వివిధ పనులపై బయటకు వచ్చేవారు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో శీతల పానీయాల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. చెరకు రసం, లస్సీ, మజ్జిగ, షర్బత్, లెమన్ సోడా, కొబ్బరిబొండాలు, ఫ్రూట్‌జ్యూస్, మిల్క్‌షేక్స్, పుచ్చకాయలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. రామాటాకీస్, సీతంపేట, శంకరమఠం రోడ్డు, అక్కయ్యపాలెం, 80 ఫీట్ రోడ్, సీతమ్మధార, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో కూల్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఇదే అదునుగా వ్యాపారులు అధిక ధరలకు శీతల పానీయాలను విక్రయిస్తున్నారు.

ఫ్రూట్ జ్యూస్‌లకు ఫుల్ డిమాండ్


డైమండ్ పార్కు రోడ్డులో జ్యూస్‌లతో దాహం తీర్చుకుంటున్న జనం

వేసవి తాపాన్ని తీర్చేందుకు సీజనల్ ఫ్రూట్స్‌తో చేసిన సుమారు 14 రకాల జ్యూస్‌లను విక్రయిస్తున్నారు. యాపిల్, సపోటా, ద్రాక్ష, బొప్పాయి, వాటర్‌మిలన్, క్యారట్, స్వీట్ పంప్కిన్, బనానా తదితర జ్యూస్‌లు, మిల్క్ షేక్‌లకు డిమాండ్ పెరిగింది. ఆర్డనరీ జ్యూస్ రూ.30కు, ప్యూర్ జ్యూస్ రూ.50కు, మిల్క్‌షేక్స్ రూ.80కు చల్లచల్లగా అందిస్తున్నారు.

నిమ్మసోడా, షర్బత్‌లతో చల్లదనం


శంకరమఠం రోడ్డులో నిమ్మసోడా, షర్బత్‌లు విక్రయిస్తున్న వ్యాపారి

చూడగానే తాగేయాలనిపించే నిమ్మసోడాలు, షర్బత్‌ల విక్రయాలు ఊపందుకున్నాయి. సుగంధి వేళ్లు, మారేడు ఎండుకాయల నుంచి రసం తీసి పంచదార పాకంతో కలిపి తయారు చేస్తున్న షర్బత్‌లకు డిమాండ్ పెరిగింది. ఇవి దాహాన్ని తీర్చడమే కాక వేసవి తాపాన్ని తగ్గించి, శరీరాన్ని చల్లబర్చుతాయని విక్రేతలు చెబుతున్నారు.

తాజా తాటి ముంజెలు


అక్కయ్యపాలెం రోడ్డులో తాటికాయలు కొంటున్న జనం

వేసవి తాపాన్ని తీర్చే తాటి ముంజెలకు ప్రతి వేసవిలో మంచి డిమాండ్ ఉంటుంది. తగరపువలస పరిసర ప్రాంతాల నుంచి ఆటోల్లో తాటి కాయలను తెచ్చి అప్పటికప్పుడు కొట్టి ముంజెలు ఇస్తున్నారు. ఫ్రెష్‌గా ఉండటంతో తాటి ముంజెల కన్నా తాటికాయలపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఇవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. రియల్ ఎస్టేట్ ప్రభావంతో భూమి చదును చేయడంతో చాలా వరకు తాటిచెట్లు కనుమరుగయ్యాయని విక్రేతలు చెబుతున్నారు. తాటిచెట్ల కొరతతో తాటికాయలకు మంచి గిరాకీ పెరిగింది. రూ.20కు మూడు కాయలు అమ్ముతున్నారు. ముంజెలు డజను రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు.

అగ్రస్థానంలో కొబ్బరి బొండాలు



వేసవి తాపాన్ని తీర్చడంలో కొబ్బరి బొండాలు అగ్రస్థానంలో నిలుస్తాయని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కొబ్బరి నీరు దాహార్తిని తీర్చి వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది. నిన్న మొన్నటి వరకు చిన్నవి రూ.30, పెద్దవి రూ.40కు విక్రయించిన బొండాలు వేసవి ప్రభావంతో రూ.50 నుంచి ధర పలుకుతున్నాయి. ధర ఎక్కువైన ఆరోగ్య ప్రదాయిని కావడంతో కొబ్బరి బొండాలకు డిమాండ్ తగ్గలేదు.

చెరకు రసంతో తక్షణ శక్తి


అక్కయ్యపాలెంలో చెరుకు రసం తాగుతున్న పాదచారులు

కొబ్బరి బొండాల తరువాత చెరకు రసానికి విపరీతమైన డిమాండ్ ఉంది. చెరకు రసం దాహాన్ని తీర్చడమే కాకుండా శరీరానికి గ్లూకోజ్‌ను అందించి తక్షణ శక్తిని ఇస్తుంది. అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి తెచ్చిన చెరకుతో విక్రేతలు చెరకు రసం చేసి కూల్ కూల్‌గా అందిస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా స్నాతకోత్సవం


ముఖ్య అతిథులతో సేఫ్టీ కోర్సుల సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సులకు స్నాతకోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ కోర్సుల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ జారీ చేసిన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్య అతిథి జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డి, విశిష్ట అతిథి స్టీల్‌ప్లాంట్ జీఎం(శిక్షణ, హెచ్‌ఆర్‌డీ) టి.కె.ఎస్.ఆర్.ఠాగూర్ శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సేఫ్టీ కోర్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, కరిక్యులం కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

మద్రిపాలెం: గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు జీఆర్‌పీ సీఐ ధనంజయనాయుడు తెలిపారు. కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన కొప్పిశెట్టి రాజేష్, తాడేలు నాగవెంకట శేషు అనే వీరిద్దరిని శుక్రవారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

డ్రైడేతో దోమల నిర్మూలన


డ్రమ్ముల్లో పెరుగుతున్న దోమ లార్వాలను పరిశీలిస్తున్న హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. ఏఎన్‌ఎం, ఆశా, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి, ఆ నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజులు దాటి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని, వారానికి ఒక రోజు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకుల్లో నీటిని తొలగించి ఆరబెట్టి మళ్లీ నీటిని పట్టుకోవాలని సూచించారు.

నేడు కేజీహెచ్‌లో కొత్త నిర్మాణాల ప్రారంభోత్సవం

అల్లిపురం: కేజీహెచ్‌లో శనివారం పలు కొత్త నిర్మాణాల ప్రారంభోత్సవం జరగనుందని సూపరింటెండెంట్ పి.శివానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీహెచ్ ఆవరణలో మార్చురీ వద్ద నిర్మించిన పోలీస్ అవుట్ పోస్ట్, టిస్లా సెంటర్ వద్ద రోగుల నిరీక్షణ షెడ్లు, ఫార్మసీ వద్ద రోగుల నిరీక్షణ షెడ్లకు ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ హరేందిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొంటారని పేర్కొన్నారు.

కిశోర బాలికలకు వ్యాయామం, క్రీడలు అవసరం

మద్దిలపాలెం: కిశోర బాలికలు శారీరకంగా దృఢంగా ఉండేందుకు, ఆరోగ్యానికి వ్యాయామంతోపాటు క్రీడలు అవసరమని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ ఏసీడీపీవో శ్రీలత అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేఆర్‌ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు ఆటలు, వ్యాయామంపై ఆమె అవగాహన కల్పించారు. విద్యతోపాటు క్రీడలు, వ్యాయామం ఎంతో అవసరమన్నారు. పౌష్టికాహారం లాభాల గురించి తెలియజేశారు. ఈ అంశాల్లో బాలికల సందేహాలను తెలుసుకుని, వాటి నివృత్తి చేశారు. మద్దిలపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ సెల్వియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి, ఎంఎస్‌కే, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్, కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం


ముఖ్య అతిథులతో బహుమతులు పొందిన విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లలు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గణిత ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు, యోగా మాస్టర్ జీఎస్ఎన్ మూర్తి, యు.రాజ్యలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలను నిత్యజీవితంలో పాటించాలని వక్తలు విద్యార్థులకు సూచించారు. మహానుభావుల ఉత్తమ లక్షణాలను అలవరచుకోవాలన్నారు. యోగా, ఆర్ట్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజికల్ చైర్, వ్యాసరచన పోటీలు, క్విజ్, లెమన్ స్పూన్, పద్య పఠనం, క్యారమ్స్, పెయింటింగ్, పరుగు పందెం, స్టోరీ టెల్లింగ్, సమ్మర్ క్యాంప్‌లో తాము సాధించిన ప్రతిభను విద్యార్థులు సభలో ప్రదర్శించారు. పుస్తక పఠనం నిరంతర ప్రక్రియగా పాటిస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను సత్కరించారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

వాల్తేర్ డివిజన్‌లో లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాలు


డీఆర్‌ఎం కార్యాలయం వద్ద స్ట్రీట్ ప్లే నిర్వహిస్తున్న సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో శుక్రవారం అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా జూన్ 5 నుంచి వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్వేస్ ప్రతి ఏడాది లెవెల్ క్రాసింగ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఇండియన్ రైల్వేస్ ఈ ఏడా మంచి నిర్ణయాలు తీసుకునేందుకు ప్రజలకు సహకరిద్దాం అనే నినాదంతో, ప్రతి సారి మంచి నిర్ణయాలు తీసుకుందాం అనే స్లోగన్‌తో అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. సివిల్ డిఫెన్స్ సభ్యులు, సివిల్ ఇంజినీరింగ్ సిబ్బంది, రైల్వే భద్రతా సిబ్బంది పలు బృందాలుగా ఏర్పడి ప్రజలు కూడుకునే ప్రాంతాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, స్ట్రీట్ ప్లేలు నిర్వహించారు. దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ జెండా ఊపి ప్రారంభించారు. భద్రత లేని లెవెల్ క్రాసింగ్స్ వద్ద ట్రాక్స్ దాటడం వల్ల కలిగే ప్రమాదాలు, అనర్థాలను వివరించారు. కార్యక్రమాల్లో సీనియర్ డివిజన్ సేఫ్టీ ఆఫీసర్ ఎంకే సాహూ, డివిజనల్ పీవే ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వై.రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధురానగర్ హైస్కూల్ హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ


హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీ నరస

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయినిగా శుక్రవారం లక్ష్మీ నరస బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న లక్ష్మీ నరస ఈ స్కూల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన శాంతికుమారి రైల్వే న్యూకాలనీ కేఎన్‌ఎం స్కూల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరస మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందిస్తానని తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి


కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో పలు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావులను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ కోరారు. జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన వారిద్దరిని కలిసి వినతిపత్రాలు అందించారు. వార్డులోని గాంధీనగర్, అంబేడ్కర్ కాలనీల్లో గల గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని, మంచి వసతులతో విశాలమైన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఈస్ట్ పార్కులో విద్యుత్ దీపాలు, సింహాద్రి పార్కులో వసతుల కల్పన, సింహాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే రోడ్డులో కొంతమేర నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. వుడా కాలనీలోని 48 సెంట్ల ప్రభుత్వ స్థలంలో అర్బన్ హెల్త్ సెంట్రల్ లేదా ప్రైమరీ స్కూల్ నిర్మించాలని, మాధవధార శ్మశానవాటికను ఆధునీకీకరించి సదుపాయాలు కల్పించాలని కోరారు. కళింగనగర్‌లో నూతన అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి సహకరించాలని, వార్డులో పలు చోట్ల వీధిలైట్లు లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని, అంబేడ్కర్ నగర్‌లో టీడీఆర్‌ల సమస్యకు పరిష్కారం చూపాలని, వార్డులోని డ్రైనేజీలు, గెడ్డలను ఆధునీకీకరించాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.

కుటుంబం చెంతకు బిహార్ వాసి


కుటుంబ సభ్యులకు రాంబిహారీని అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధి

అల్లిపురం: నల్లమందుకు అలవాటు పడి మతిస్థిమితం కోల్పోయి రోడ్డున పడ్డ బిహార్ వ్యక్తిని ఏయూటీడీ సభ్యులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. జీవీఎంసీ ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం, దర్బంగ జిల్లా సిసపునా గ్రామానికి చెందిన రాంబిహారి ఇల్లు వదిలిపెట్టి లూథియానా వెళ్లిపోయాడు. అక్కడ బిచ్చగాళ్లతో స్నేహం చేసి నల్లమందుకు అలవాటుపడ్డాడు. దీంతో మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో మత్తులో ఎక్కడెక్కడో తిరిగి విశాఖ చేరుకున్నాడు. గత ఏడాది నవంబర్‌లో రైల్వే స్టేషన్‌లో ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో అతను పట్టుబడ్డాడు. అతన్ని షెల్టర్‌కు తరలించి పూణేకి చెందిన శ్రద్ధ ఫౌండేషన్ సహకారంతో చికిత్స అందించడంతో అతని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. దీంతో అతన్ని నేరుగా బీహార్‌లోని అతని స్వగ్రామానికి తీసుకెళ్లి అతని తల్లి కౌశల్య ముఖియా, సోదరుడు రాజ్‌కుమార్ ముఖియాకు అప్పగించారు. దీంతో వారు ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

సర్వం.. శ్రీనివాసమయం

వైభవంగా వెంకన్న కల్యాణం


సూర్యప్రభ వాహన సేవలో తిరుమలేశుడు


శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణం తిరుపతిని తలపించింది. భక్తుల గోవింద నామస్మరణతో ప్రాంగణం అంతా మార్మోగింది. ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిపారవశ్యంతో నిర్వహిస్తున్నారు. దివ్యక్షేత్రం చైర్మన్ గుత్తికొండ బాలాజీ ఆధ్వర్యంలో ఈ నెల 3న ప్రారంభించిన ఉత్సవాలు 7వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. శుక్రవారం వేకువ జాము నుంచి తిరుమలేశునికి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. మూలమూర్తికి అభిషేకం, శ్రీవారి అలంకరణ, నిత్య అర్చన అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. ఉదయం తిరుమలేశుడు సూర్యప్రభవాహనంలో ఊరేగారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, స్వామివారి మూల మంత్ర హోమం, బలిహరణ అనంతరం ముత్యాల పందిరి వాహనంలో మాడ వీధుల్లో ఊరేగారు.

కనుల పండువగా ద్వితీయ వార్షిక కల్యాణం

ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి పద్మావతి శ్రీనివాసుల కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. వందలాది మంది భక్తులు తిరుమలేశుడి కల్యాణాన్ని కనులారా తిలకించి పునీతులయ్యారు. మాంగల్యా ధారణ ముందు రుత్వికులు పుస్తెలను భక్తులకు చూపుతూ అనంతరం పద్మావతి అమ్మవారికి మాంగల్యాధారణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ సమయంలో పూర్తిగా గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు 14న రక్తదానం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకై ఈనెల 14న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం గోడపత్రికను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన ఏడుసార్లు రక్తదానం చేసి స్టీల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా 1600 రోజులుగా ఐక్య పోరాటాలు చేస్తున్నామన్నారు. కాని ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించి కార్మికుల జీవితాలను, ప్లాంట్ భవిష్యత్తును మరింత సంక్షోభంలోకి నెట్టే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మిక వర్గం మరింత ఐక్యంగా తమ రక్తాన్ని దానం చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకులు బి. అప్పారావు మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా జూన్ 14న అంబేద్కర్ కళాక్షేత్రంలో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ నాయకులు పి. శ్రీనివాసరాజు, కె.గంగాధర్, పూర్ణచంద్రరావు, కె. శ్రీనివాస్, కొయిలాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ


పోలీస్ స్టేషన్ ప్రారంభిస్తున్న నగర సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్ స్టేషన్ భవన మరమ్మతు పనులు పూర్తవడంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం దాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోలీస్ స్టేషన్ భవనం వర్షాలకు కారుతూ, కార్యాలయంలో ఉన్న ఫైళ్లు తడిసిపోతున్నాయని తెలుసుకుని పోలీస్ వెల్ఫేర్ సంక్షేమ నిధి నుంచి రూ. 2 లక్షలు కేటాయించి మరమ్మతులు చేయించినట్లు కమిషనర్ తెలిపారు. భవనం ప్రారంభం అనంతరం, పోలీస్ కమిషనర్ సిబ్బందితో సమావేశమయ్యారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీ-2 మేరీ ప్రశాంతి, హార్బర్ ఏసీపీ కాళిదాస్, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి యోగా తరగతులు


యోగా సాధన చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

డాబాగార్డెన్స్: ఈ నెల 21న ఆర్‌కే బీచ్ వేదికగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రలో భాగంగా శుక్రవారం ఆర్టీసీ సిబ్బందికి విశాఖపట్నం డిపోలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ డిపో మేనేజర్ కె. గంగాధరరావు యోగా ప్రాముఖ్యత సిబ్బందికి వివరిస్తూ, ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.